# మినీకథ

కృష్ణా ఎక్స్‌ప్రెస్ అప్పుడే గుంటూరు ప్లాట్‌ఫామ్‌మీద నిండుగర్భిణిలా వచ్చి ఆగింది. లోపలివాళ్ళకు రెట్టింపు జనం బయట వున్నారు. ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళని దిగనివ్వకుండానే ఎక్కేస్తున్నారు.

"ఏంసార్. సీటుకావాలా బెర్త్? చెప్పండి సార్. మంచి కన్వీనియంట్ సీటు. విండో సైడయితే ఆర్రూపాయలు. మరోటయితే ఐదూ.... బెర్తయితే పన్నెండు—ఏది కావాలి త్వరగా చెప్పండి సార్— అవతల మరో పాసెంజరు వెయిట్ చేస్తున్నాడు— మీరు కాదంటే...." ఇంగ్లీషు ప్రయోగాలు స్పష్టంగా చెయ్యగలుగుతున్నాడు.... మీదు మిక్కిలి ఆ అడగడం చాలా బావుంది.

ఇతని మాటలు వింటున్నట్టే నటిస్తూ వినకుండా అటెటో చూస్తున్న అతను. అదే అతని పేరు "రఘు". "నీలాంటివాళ్ళని చాలా మందిని చూశాన్లే" అనే చూపొకటి విసిరి. "అవసరంలేదులే పోవయ్యా" అనేశాడు.

"ఈమాట ఇందాకే చెప్పొచ్చుగదయ్యా ఛఛ ఏం పాసింజర్లో ఏమో!" గొణుక్కుంటూ పోతున్న పోర్టరుమీద రఘుకి జాలేసి. కాసేపట్లో అది చిర్నవ్వుగా మారి పెదవులమీదనుంచి తప్పుకుంది.




హఠాత్తుగా అతనికళ్ళు పెద్దవయ్యాయి. ఓ కంపార్టుమెంటుదగ్గర జనం తొక్కిడి. తోపులాటతో కిటకిటలాడిపోతోంది. కనీసం ఆ గుంపు 2.3 మీటర్ల పొడవుంది.... అతని "బుర్ర" చెకచెకా పనిచేసింది. మెల్లగా గట్టుదిగాడు. అతనికి తెలుసు-ఆ గుంపంతా ఎక్కేసరికి కనీసం అరగంటయినా పడుతుందని. పైగా అందులో చీమ దూరడానికి కూడా సందులేదు. అతనూ వెళ్ళి ఓ ప్రక్కన నుంచున్నాడు. ప్రక్కనే ఒక అప్సరసలాంటి అమ్మాయి ముఖంలో కళ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఆ వర్చస్సు ఆమెకి కళ్ళజోడు మూలంగా వచ్చిందని ఇట్టే గుర్తుపట్టేయొచ్చు. ముక్కు కొనదేలి ఎర్రగా కోపానికి చిహ్నమన్నట్టు. కళ్ళు రెండూ ఆదుర్దాని సూచిస్తూ. ఒక చేత్తో పుస్తకాల్ని గుండెలకి హత్తుకొంటూ మరోచేత్తో రైల్వే కంపార్టుమెంట్‌కున్న కడ్డీని ఊతగా పట్టుకోవాలని చూస్తోంది. ఆ సీను కోసమే ఎదురుచూస్తున్నట్టు ఇద్దరు ముగ్గురు ఆమె చుట్టూ చేరారు.... ఇది చూసేసరికి రఘుకి మండింది. అతని మనస్సు లోలోన వాళ్ళని తిట్టుకుంది. ఏమైతే అయిందని తనూవెళ్ళి ఆ ముగ్గురిలో జొరబడ్డాడు.

సరిగ్గా డోర్ ఇంక అడుగు దూరంలో వుండనగా రఘు ఆమె వెనుకే 'బాడీగార్డ్'లా ప్రొటెక్షన్‌గా నిలబడ్డాడు. వెనుకవాళ్ళు తోసే తోపులకి వెళ్ళి ఆమె మీద పడుతున్నాడు. ఆమె ఇదేమీ పట్టించుకోవటం లేదన్నట్టూ లోనికెక్కడానికే ప్రయత్నం చేస్తోంది. అతనికేదో పులకింత.... హాయి. ముందేదో యూఫోమ్ బెడ్డున్నట్టు ఊహ. వెనుక అతను నిలబడ్డ తీరు చూస్తే ఆ అమ్మాయికితను కావ(తె)లిసినవాడని ఎవ్వరైనా యిట్టే ఊహించేస్తారు.

ఆ త్రొక్కిడిలో నుంచి ఎలాగైతేనేం కంపార్ట్‌మెంట్‌లో కెక్కేశారు. ఆమె వెనుకే తను. వెనుకవాళ్ళు "ఏమయ్యా ముందుకుపోరు. ఎక్కేవాళ్ళే మవ్వాలి మీకెక్కితేనే సరా" అనే మాటల్లో "ముందుకుపో" అన్నమాటతప్ప మరేం వినపడలేదతనికి.... లెవేటరీ దగ్గర కొచ్చేశారు. ఆ మూలలో యిరుక్కుని యింక ముందుకు పోలేమన్నట్టు నుంచున్న ఆమె యిందాకటినుండి తనని వెనుకనుండి తోస్తున్న వాడిని చూడగానే గుండె ఝల్లుమంది. 'అరె ఒక బామ్మ నా వెనుకే వస్తుండాలే ఏమైందావిడ' అనుకొంది సమాధానంగా జనంలోనుండి ఓ మూలుగు లాంటి కేక.... అంటే ఆవిడింకా యెక్కలేదన్నమాట. "పూర్ క్రీచర్" అనేమాట లామె గొంతుదాటి బయటకొచ్చి మళ్ళి లోపలి కెళ్ళాయి.

మళ్ళితోపిడి యెక్కువైంది. ఈసారి ఓ బలమైన మనిషి అలా లోపలికి ఏనుగొస్తున్నట్టు వచ్చేస్తున్నాడు .... ఎవరో ఏదో గొణుక్కుంటున్నారు. చిన్నపిల్లలు ఏడుస్తున్నారు. తల్లులు పాలడబ్బాలు బయటకు తీస్తున్నారు. అతగాడి తోపిడికి రఘువెళ్ళి ఆమె కతుక్కున్నాడు. ఎవ్వరూ తమని గమనించడం లేదని తెలుసుకొన్నాక. మెల్లగా ఒకచేయి ఆమె నడుందగ్గరికి పోనిచ్చాడు.. ఆమెకేవిధమయిన స్పర్శ తెలియడంలేదని అతనికి తెలిసింది. ఆమె రియాక్షన్‌నిబట్టి ఇంక తనదే ఆలస్యం.... వెనుకవాళ్ళు తోస్తున్నట్టు ఒక చిన్న "స్లిప్" ఇచ్చి తను జారిపడిపోతున్నట్టు ఆమెని గట్టిగా ఒకచేత్తో ఒడిసి పట్టుకొని తనదగ్గరికి లాక్కున్నాడు. అతనిమొహం ఇప్పుడామె భుజాలవెనుక వుంది. ఆ వెచ్చటి వూపిరి స్పర్శకూడా ఆమెకి తెలియడం లేదన్నట్టు ఆమె ఇవేమీ పట్టించుకోకుండా 'పెదవి గట్టిగా కొరుక్కుంటూ' సగందూరం వచ్చేసింది. ఎక్కడా సీట్లలో ఖాళీలేదు. సరే చివరివరకు చూద్దామని ఆమె రెండు మూడు సీట్లకివతల వుండగా గార్డు విజిల్‌వేశాడు.

అతని గుండెల్లో ఎక్కడో దడ.... అందుకే ఆ తొందరలో ఆమెతోపాటు కంపార్ట్‌మెంట్‌కున్న రెండో డోరు దగ్గర కొచ్చేశాడు. డీసిల్ ఇంజన్ కూతేసింది. ట్రైన్ కదిలింది. రఘు దిగబోతున్నాడు.... స్ప్లిట్ సెకండ్‌లో జరిగిన హఠాత్సంఘటన.

ఆమె చెయ్యిచాచి బలంగా అతని చెంప మీద కొట్టింది. "యూ రాస్కెల్-నన్ను నీ భార్యనుకున్నావేరా!" అతని తల తి రు.... గు.... తున్నట్టు. శరీరం గాల్లో తేల్తున్నట్టు. మెదడులోనరాలు చిట్లిపోతాయా అన్నట్టు ప్లాట్‌ఫామ్ మీదికి దూకేశాడు. మోకాళ్ళు దోక్కుపోయాయి. లేచాడు. సంచితో దులుపుకున్నాడు.

నేనెన్నోసార్లిలా ఆడవాళ్ళని అనుభవించాను కానీ....కానీ నన్నెవ్వరూ నీలా కొట్టి మనిషిని చెయ్యలేకపోయారు. అవును మనిషికోమాట. పశువుకోదెబ్బ! అతని గొంతులోనుండి అస్పష్టంగా ఒకేమాట బయటకొచ్చింది.

"థ్యాంక్ యూ మేడమ్".

హిమబిందు